
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 17 అక్టోబరు 2025



ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడటౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకఅని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని బస్ డిపో వద్ద గల 144ఇందిరమ్మ ఇండ్లనిర్మాణాలపై ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో గృహ నిర్మాణ, ఆర్అండ్‌బీ మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం గురువారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మ గౌరవంతో బతకాలనే ఆలోచనతో ప్రభుత్వం ఇండ్లు నిర్మించాలని నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. బస్ డిపో వద్ద 144 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకోసం ఇప్పటికే గతంలో లబ్దిదారులక మంజూరు పత్రాలను అందజేశామని తెలిపారు. వాటి నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే నిర్మాణాలను డిసెంబరు 15 లోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, గృహ నిర్మాణ శాఖ పీడీ శంకర్, ఆర్అండ్‌బీ డీ శాంతయ్య తదితరులున్నారు.



బకాయిల మాటేమిటో..?

● 6 నెలలుగా అందని సన్నరకం బోనస్
● జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
● సన్న రకం బోనస్ బకాయిలు రూ 4.38 కోట్లు
● జిల్లాలో సగానికి పడిపోయిన సన్న రకం సాగు
● ఈసారి ప్రైవేట్ వ్యాపారుల వైపు రైతుల మొగ్గు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సన్నరకం వరిసాగు వైపు రైతులను మళ్లించడానికి ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహంగా ప్రకటించిన క్వింటాళుకు రూ.500 బోనస్‌కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో గత యాసంగి సీజన్‌లో విక్రయించిన సన్నరకం ధాన్యం బోనస్ కోసం ఆరు నెలలుగా రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం వానకాలం సీజన్‌ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నా సన్నరకం బకాయిల మాట మాత్రం చెప్పడం లేదు. బుధవారం పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ధాన్యంకొనుగోలు చేశాక 48గంటల్లో రైతులకు మద్దతు ధరతో పాటు సన్నాల బోనస్ జమ చేస్తామని ప్రకటించారు. గత ఏడాది యాసంగిలో సన్నాల బోనస్ మాత్రం విడుదల చేస్తామని చెప్పకపోవడం రైతులు అయోమయంలో పడ్డారు. జిల్లాలో కొందరు రైతులు సన్నరకం ధాన్యం ప్రైవేట్ వ్యాపారుల వైపు మొగ్గు చూపుతున్నారు.

● సన్న రకం ధాన్యం బోనస్ రూ 4.38 కోట్లు పెండింగ్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి సీజన్లో 244 కొనుగోలు కేంద్రాల ద్వారా 44,767 మంది రైతుల నుంచి రూ.624.89కోట్ల విలువైన 2.69లక్షల మెట్రిక్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 2.60 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం 8,786 మెట్రిక్‌ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యంలో ఐకేపీ ద్వారా 7291 మెట్రిక్ టన్నులు, సింగిల్ విండోల ద్వారా 1,388 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 105 మెట్రిక్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 1,255 మంది రైతులు సన్నరకం బోనస్‌కు అర్హులుగా ఉన్నారు. ఇందుకు సంబంధించి బోనస్ బకాయిలు రూ 4.38 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

● తగ్గిన సన్నాల సాగు

ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌తో సన్నాల సాగుపై ఆసక్తి చూపిన రైతులు డబ్బులు రాకపోవడంతో వానాకాలంలో సన్నరకాల సాగు తగ్గించారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో 13వేల ఎకరాల్లో సన్న రకాల సాగు చేశారు. రైతులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ 500 బోనస్ జమ చేయడంతో యాసంగి సీజన్‌లో సన్నల సాగును పెంచుకుంటూ 17వేల ఎకరాలు చేశారు. ఆరునెలలుగా బోనస్ రాకపోవడంతో ప్రస్తుత వానకాలం సీజన్లో 9,478 ఎకరాలకి పరిమితం అయ్యారు. ప్రస్తుతం జిల్లాలో వానకాలం సీజన్ 1.84 లక్షల ఎకరాలు వరి సాగు చేశారు. దిగుబడి 4.54 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో దొడ్డు రకం 4.37 లక్షల మెట్రిక్ టన్నులు, సన్న రకం 17,032 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ 3.24లక్షల మెట్రిక్‌టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 3.15లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డురకం, 9వేలు మెట్రిక్ టన్నులు సన్న రకం ధాన్యం కొనుగోలు చేయనున్నది. అక్టోబరులో 47,584 మెట్రిక్‌టన్నులు ధాన్యం మార్కెట్‌లో వస్తుందని అందులో పౌరసరఫరాలశాఖ ద్వారా 5వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు, నవంబరులో 341060 మెట్రిక్ టన్నుల్లో 1.80లక్షల మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 65,622 మెట్రిక్ టన్నుల్లో 80 వేల మెట్రిక్‌టన్నులు, 2026 జనవరిలో 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉండగా 231 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐకేపీ ద్వారా 144 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 79 కేంద్రాలు, డీసీఎంఎస్ ద్వారా ఒకటి, మెప్మా ద్వారా 7 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

జువైనల్ జస్టిస్ బోర్డు ప్రారంభం



జువైనల్ జస్టిస్ బోర్డును ప్రారంభిస్తున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి సృజన

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో జువైనల్ జస్టిస్ బోర్డును గురువారం అదనపు జూనియర్ సివిల్ జడ్జి సృజన ప్రారంభించారు. ప్రతి గురువారం జువైనల్ కోర్టు వ్యవహారాలు కొనసాగుతాయి. ఉమ్మడి కరీంనగర్ జువైనల్ జస్టిస్ బోర్డు నుంచి సిరిసిల్లకు 63 బాలనేరస్థుల కేసులు బదిలీ అయ్యాయి. దీంతో కోర్టు బెంచ్ కార్యకలాపాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, బాల సంరక్షణ సమితి చైర్మెన్ కంటం అంజయ్య, సభ్యులు ఖాజా నజీమోద్దిన్, డిసిపిఓ కవిత, జెజెబి సభ్యులు రమణ , వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, సిరిసిల్ల బార్ అసోసియే షన్ కార్యదర్శి తంగళ్ళపల్లి వెంకటి, జిపి కళ్యాణ్‌చక్రవర్తి, న్యాయవాదులు ఆడెపు వేణు, వాతపు మౌళి, బూర కల్యాణి, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలి

● కొవ్వొత్తులతో రేవా నిరసన



కొవ్వత్తులతో నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలో రేవా (రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొవ్వతులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మనోవేదనతో మృతి చెందిన రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు రేవా జిల్లా నాయకులు రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొవ్వొత్తులతో ప్రదర్శనగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవా జిల్లా అధ్యక్షు డు మల్లారపు పురుషోత్తం మాట్లాడారు. కార్యక్రమంలో యూని యన్ కోశాధికారి పిల్ల ధర్మయ్య, ఉపాధ్యక్షులు వంగ సుధాకర్, జంపాల వెంకటయ్య, ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు రేపక రాజు, కుంట లక్ష్మన్, టీ అంజయ్య, కుబేర స్వామి, సాదత్ ఆలీ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

● జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం



అంగన్వాడీలో చిన్నారులతో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

వేములవాడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషక వివలున్న ఆహారం తీసుకోవాలని జిల్లా సంక్షమ అధికారి పి. లక్ష్మీరాజం అన్నారు. వేములవాడ మండలంలోని చంద్రగిరి అనుసంధాన గ్రామమైన తెట్టెకుంటలోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల యొక్క పూర్వ ప్రాథమిక విద్యను పరిశీలించారు. కేంద్రంలో గర్భిణిలకు బాలింతలకు అందిస్తున్న పోషక ఆహారం గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని, తాజా కూరగాయాలని తీసుకోవాలని సూచించారు. పాలు, గుడ్లు సంపూర్ణ ఆహారమని వాటిని తప్పకుండా ప్రతి రోజు తీసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు ఆకుకూర తప్పనిసరిగా ఉండాలని, నాణ్యమైన సరుకులు సమయానుకూలంగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

బీసీ జేఏసీ బంద్‌కు బీసీటీఏ సంఘం మద్దుతు

వేములవాడటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సం స్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ విషయంలో బీసీ జేఏసీ ఉచ్చిన రాష్ట్ర బంద్‌కు బీసీటీఏ సంపూర్ణ మద్దుతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్కుర్తి లక్ష్మీనారా య ణ అన్నారు. వేములవాడ పట్టణం లోని సంఘ సభ్యులతో కలిసి గురు వారం ఆయన మాట్లాడుతూ బీసీల కు జనాభా 52శాతం ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించడం సము చితమే అని అన్నారు. ఈ నెల 18న బీసీ జేఏసీ పిలుపు మేరకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పులి రామ్‌గోపాల్, తాటి కొండ కృష్ణహరి, బండారి మల్లేశం తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ గ్రామ సభలు

ఇల్లంతకుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) మండలంలోని ముస్కానిపేట, రామోజీపేట గ్రామాలలో ఉపాధిహామీ గ్రామసభలు జరిగాయి. గ్రామపంచాయతీ కార్యాలయాలలో గురువారం జరిగిన సమావేశాలలో రాబోవు రోజుల్లో చేపట్టే పనుల జాబితాలను సిద్దం చేశారు. ఏపీఓ చంద్రయ్య, టీఏలు పుష్పలత, కరుణాకర్, ఫీల్డ్అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

తెలంగాణ బంద్‌ను జయప్రదం చేయాలి

● బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు



చేతులు కలిపి అభివాదం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా తెలంగాణ రాష్ట్ర బంధును జయప్రదం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంఘాల నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంఘాల జేఏసీ నాయకులతో సమావేశం జరిగింది. బీసీల 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా తెలంగాణ రాష్ట్ర బంధుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంఘాల జిల్లా నాయకులు పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మాండ్లు మాట్లాడారు. ఈ నెల 18న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు కత్తెర దేవదాస్, బొజ్జ కనకయ్య, బొప్ప దేవ య్య, చొక్కాల రాము, భిక్షపతి, సుధాకర్, మల్లేశం, అంజయ్య, యెర్రం మల్లయ్య, కమలాకర్, రామాగౌడ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశంయాదవ్, రాజు, కైలాసం, తిరుపతి, ప్రభాకర్, బూర అంజనేయులు పాల్గొన్నారు.

ఎన్గల్‌లో వాగుపై వంతెనల నిర్మాణం చేపట్టాలి

చందుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్గల్ గ్రామంలోని వాగుపై వంతెనల నిర్మాణం చేపట్టాలని గ్రామ నాయకుడు పుప్పల మోహన్ అన్నారు. చందుర్తి మండలం ఎనగల్ గ్రామం లోని ఎల్లమ్మ గుడి, పెద్దమ్మ గుడి ప్రాంతంలోని వాగుపై రెండు వంతెనలు నిర్మించాలని మోహన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి గ్రామస్థులు గురువారం వినతిపత్రం అందజేశారు. అధికారులు, నాయకులు స్పందించి వెంటనే గ్రామానికి రెండు వంతెనలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ కుల సంఘం సభ్యులు దాదాపు 50 మంది పాల్గొన్నారు.

ఓటరు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరిత, అధికారులు

సిరిసిల్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఓటరు పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటరు జాబితా ఇతర అంశాలకు సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం హరిత హాజరయ్యారు. సీఈఓ మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారుల నియామకం, నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ వంటి పలు అంశాలపై సూచనలు చేశారు. ఓటర్ జాబితా సంబంధించి పెండింగ్ దరఖాస్తులు ఎక్కడైనా ఉంటే కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఫారం 6,7,8 దరఖాస్తులకు సంబంధించి, నోటీస్ పీరియడ్ జారీ చేసిన 7 రోజులలోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ప్రతి పోలింగ్ బూత్‌కు బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)ల నియామకం పూర్తి కావాలని, వారికి ఐడీ కార్డులు జారీ చేయాలని సూచించారు. నూతన ఓటర్లకు ఓటర్ ఐడీ కార్డుల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, వేములవాడ తహసీల్దార్ విజయ ప్రకాష్‌రావు, కలెక్టరేట్ పర్యవేక్షకుడు ప్రవీణ్, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు



మాట్లాడుతున్న కత్తెర దేవదాస్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పాలిత రాష్ట్రాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రాలిత రాష్ట్రాలలో బీజేపీ నాయకుల అత్యాచారాలు, హత్యలు, దాడులకు అంతేలేకుండా పోయిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిపై ఆర్ఎస్ఎస్ గూండా దాడి చేయడం అమానుషం అన్నారు. హర్యానలోని ఐపీఎస్ అధికారిని కులహంకారంతో అగ్రవర్ణాలు అవమానించడంతో ఆత్యహత్యలకు పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ ప్రాలిత రాష్ట్రాలలో దళిత, బహుజనులైన అధికారులకు స్వేచ్ఛ లేదని అన్నారు. రాహుల్ గాంధీ పేరు తీసినందుకు హరిహోం వాల్మికి అనే దళితుడి మెడ మీద కాలు పెట్టి బీజేపీ గూండాలు హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, నాయకులు ఆకునూరి బాలరాజు, ఆవునూరి ప్రభాకర్, నేదురి లక్ష్మన్, గొల్లపల్లి పరుశురాములు, చొక్కాల రాము, అన్నల్‌దాస్ భాను, గడ్డం కిరణ్, కొమ్ము త్యాగరాజు, చెరుకు మోహన్, అకునూరి ప్రవీన్, కంసాల మల్లేశం, వంతడుపుల రాము పాల్గొన్నారు.

మిగిలింది రెండు రోజులే

● టెండర్‌లకు ఆసక్తి చూపని మద్యం వ్యాపారులు
● 20 రోజుల్లో 552 దరఖాస్తుల దాఖలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వైన్స్‌ల టెండర్‌లకు ఇక మిగిలింది రెండు రోజులే. జిల్లాలో వైన్స్ టెండర్‌లకు తక్కువగా దరఖాస్తులు వస్తున్నాయి. జిల్లాలోని 48 వైన్స్‌లలో 9 గౌడ్స్‌కు, 5ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. చివరి మూడు రోజుల్లో ఒక్కో రోజు 500 దరఖాస్తులు దాఖలవుతాయని ఎక్సైజ్ అధికారులు వేసిన అంచనా తలకిందులయ్యే పరిస్థితి నెలకొంది. గురువారం దశమి రోజున కేవలం 1,17 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. జిల్లాలోని 48 వైన్స్‌లకు 552 దరఖాస్తులు దాఖలు చేశారు. ఈ దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్ శాఖకు ఇప్పటివరకు రూ. 16.56కోట్ల ఆదాయం సమకూరింది. ఎట్టకేలకు అన్ని వైన్ షాప్‌లకు దర ఖాస్తులు వచ్చాయి. ఇందులో సిరిసిల్ల 18 వైన్స్‌లకు - 272, వేములవాడ 16 వైన్స్‌లకు- 108, ఎల్లారెడ్డిపేట 14వైన్స్‌లకు - 172 దరఖాస్తులు దాఖల య్యాయి. దరఖాస్తుల గడువు పెంచేది లేదని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. మిగిలిన రెండు రోజుల్లో మద్యం వ్యాపారుల స్పందన ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందే.

గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక

కోనరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా ముష్టం రాజయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా జవ్వాజి శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి గుండ మహేష్ గౌడ్, గుండె తిరుపతి గౌడ్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్ గౌడ్, రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మధుగౌడ్ ఎన్నికయ్యారు.



నిజామాబాద్‌లో ఎన్నికైన గౌడ సంఘం కార్యవర్గం

సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు ధర పొందాలి

● జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం



రైతులకు కపాస్ కిసాన్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు సీసీఐ కేంద్రాలలో ప్రత్తి విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం సూచించారు. మండలంలోని పొత్తూరు, నర్సక్కపేట గ్రామాలలో ప్రత్తి రైతులకు గురువారం కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రత్తి నాణ్యత ఆధారంగా క్వింటాళుకు రూ 7,689 నుంచి రూ.8,110 మద్దతు ధర ఉంటుందన్నారు. దళారులకు పత్తిని అమ్మి నష్టపోవద్దన్నారు. వ్యవసాయ అధికారులు కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధానం, వివరాల నమోదు, స్లాట్ బుకింగ్ మొదలైన అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో రెండు కేంద్రాలలో పత్తిని కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఏఈఓ లలిత రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు బలవన్మరణం చెందారు. వీరిలో నలుగురు ఉరి వేసుకోగా ఒకరు పురుగుల మందు తాగారు. వివరాల్లోకి వెళితే..

ఉరి వేసుకుని..



రాజేశం(ఫైల్)

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గుర్రాల రాజేశం(60) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేశం కొంతకాలంగా ఒంటరిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి ఎస్ఐకొట్టేప్రసాద్, ఏఎస్ఐఖలీల్‌ఖాన్, సిబ్బంది రమీజ్ పరిశీలించారు. మృతుడి సోదరుడు గుర్రాల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శివకుమార్(ఫైల్)

వెల్గటూర్: వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన తనుగుల శివకుమార్ (33) అనేయువకుడు గురువారం ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపినవివరాల ప్రకారం శివకుమార్ నాలుగు సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం వెళ్లాడు. సంవత్సరం తర్వాత అనారోగ్య కారణంగా మతిస్థిమితం కోల్పోయాడు. అక్కడి వారి సహాయంతో సొంత గ్రామానికి తిరిగి వచ్చాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని మందులు వాడుతున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. దీనితో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి తనుగుల వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జ్యోతినగర్: స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన కాసుల రాకేష్(31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు రోజులక్రితం ఆత్మ హత్య చేసుకున్న రాకేష్ మృతదేహాన్ని గురువారం కనుగొన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న రాకేష్ ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నాడు. ఏడాది క్రితం అతని తండ్రి, 15రోజుల క్రితం రాకేష్ తల్లి చనిపోయింది. నాలుగు రోజుల క్రితమే తండ్రి సంవత్సరీకం, తల్లి దశదిన కర్మ నిర్వహించాడు. రాకేష్‌కు అక్క, బావ ఉన్నారు. దశదిన కర్మ జరిగిన రోజున బావతో రాకేష్ గొడవ పెట్టుకు న్నాడు. దీంతో అక్క, బావలు ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు దూరమైన బాధలో ఉన్న సమయంలో అక్కాబావలు కూడా దూరం కావడంతో రాకేష్ మనస్తాపానికి గురైనట్లు తెలుస్తున్నది.. ఈ క్రమంలో అదేరోజు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమా చారం ఇచ్చారు. పోలీసులు తలుపు తెరవడతో రాకేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడైంది.. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాధురి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన మాధురి(22) అనేవివాహిత బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గురువారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎక్కల్‌దేవి రవి 2024ఆగస్టు 24న మాధురిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజుల నుంచి అత్తింటి వేధింపులతో మాధురి బాధ పడుతుండేదని, భర్త ఎక్కల్‌దేవి రవి, అత్త ఎక్కల్‌దేవి సత్తమ్మ, మామ రాజం, ఆడబిడ్డ రవళి వేధింపులతో మాధురి ఆత్మహత్య చేసు కుందని తల్లి ఎర్ర లావణ్య పోలీసులకు ఫిర్యా దు చేసింది. తహసీల్దార్ నీత సమక్షంలో పంచనామా చేసి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. భర్త, అత్తమామను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైఎస్సై-2 రాజునాయక్ తెలిపారు.

పురుగుల మందు తాగి..

రుద్రంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పిట్టల నర్సయ్య (62)అనేవ్యక్తి బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులుతెలిపిన వివరాల ప్రకారం పిట్టల నర్సయ్య అప్పుల బాధతో మనస్తాపానికి గురై బుదవారం పొలంవద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు జీవం

- రూ.4.10 లక్షలతో మౌలిక వసతుల కల్పన
- ఆదర్శంగా నిలుస్తున్న చింతకుంట గ్రామస్థులు
- దాతల సహకారంతో ముగ్గురు విద్యా వలంటీర్ల నియామకం



రంగులతో అందంగా కనిపిస్తున్న చింతకుంట పాఠశాల

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంట ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు గ్రామస్థులు జీవం పోశారు. అరకొర వసతులు, విద్యార్థులు లేక బోసిపోతున్న పాఠశాలల రూపు రేఖలు గ్రామస్థుల సహకారంతో ఒక్కసారిగా మారిపోయాయి. యువత, గల్ఫ్ వలస జీవులు, మహిళలు, కుల సంఘాలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీలకు అతీతంగా నేతలు ఒక్కటై రూ.4.10 లక్షలు పోగు చేసి విద్యార్థుల సంఖ్యను అనూహ్యంగా పెంచి పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఆ మారుమూల పల్లెలో సర్కారు బడి సౌకర్యాలు సమ కూర్చుకొని విద్యార్థులతో సందడిగా కనిపిస్తోంది.

ప్రైమరీ, హైస్కూల్‌లో పెరిగిన విద్యార్థులు

ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది కేవలం 50 మంది మాత్రమే చదువుతుండేవారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 131 మందికి చేరింది. ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 53 మంది ఉండగా ప్రస్తుతం 101 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత వేసవి సెలవుల్లో గ్రామస్థులంతా కలిసి తమ పిల్లలను ప్రైవేట్ బడికి పంపవద్దని నిర్ణయించుకున్నారు. మూతపడే పరిస్థితికి చేరిన పాఠశాలను బతికించుకునేందుకు ఎన్ఆర్ఐ, యువజన సంఘాలు, మహిళలు, ప్రజాప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి విరాళాల సేకరణకు పూనుకున్నారు. రూ.4.10 లక్షలు పోగు చేసి పాఠశాలకు గేట్లు ఏర్పాటు చేశారు. చిన్నారులను విద్య పట్ల ఆకర్షితులను చేయా లనే తలంపుతో పాఠశాల గోడలపై ఆకర్షణీయమైన రంగులతో బొమ్మలు వేయించారు. సైన్స్, సోషల్‌కు సంబంధించి పటాలను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ప్రహరీ లేకపోవడం వల్ల చుట్టూ రంగుల నెట్‌ను రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్నారు.

2009-10 పదో తరగతి పూర్వ విద్యార్థులు హైస్కూల్‌లో ఫిల్టర్ వాటర్‌ప్లాంట్, 2011-12 బ్యాచ్ విద్యార్థులు వాటర్ ట్యాంక్, ఎలక్ట్రికల్ బెల్ ఏర్పాటు చేయించారు. పాఠశాలల్లో సీసీ కెమెరా లు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. విద్యా ర్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశా లలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీంతో ఇద్దరు దాతల సహకారంతో ముగ్గురు విద్యా వలంటీర్లను నియమించారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ప్రీ ప్రైమరీలోనూ 20 మంది ప్రవేశాలు పొందారు.

అదనపు తరగతి గదులు అవసరం..
సుధాకర్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం



ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య ఊహించని విధంగా పెరగడానికి గ్రామస్థులు చేసిన కృషి ఎంతో ఉంది. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుంది. ప్రస్తుతం ఉన్న ఐదు గదు లు సరిపోవడం లేదు. ప్రీప్రైమరీ కూడా కొనసాగిస్తున్నందు వల్ల అదనంగా తరగతి గదులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మరుగుదొడ్డి, గదుల మరమ్మతులు కొనసాగుతున్నాయి.

బోరు ఏర్పాటు చేయాలి..
: రవి, హైస్కూల్ హెచ్ఎం



రెండు పాఠశాలలు ఒకే ఆవరణలో ఉండగా తాగునీటికి బోరు లేదు. గ్రామస్థులను ఒప్పించి పక్కనే ఉన్న బోరును వినియోగించుకుంటున్నాం. నీరు సరిపోవడం లేదు. ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఇదే ఆవరణలో కొనసాగుతున్నాయి. మౌలిక వసతులు ఉంటేనే విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపుతారు.





ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు, పాఠశాల చుట్టూ రక్షణ కోసం చేసిన ఏర్పాట్లు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) ఇల్లందకుంట మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. జమ్మికుంట మానేరు పరివాహ ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ఇసుక ట్రాక్టర్లు సిరిసేడు వస్తుండగా, ఆపి తనిఖీచేశారు. సంబంధిత పత్రాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామ శివారులో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్దపాక గ్రామానికి చెందిన జక్కుల దేవేందర్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేస్తుండగా గ్రామశివారులో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరళిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మల్లారెడ్డిపేటకు చెందిన చందు, నందం అనే వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నారని ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరళించినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ వెల్లడించారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

ఓదెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో గురువారం పొత్కపల్లి పోలీసులు పేకాటకేంద్రంపై దాడి చేశారు. గ్రామశివారులో కొందరు పేకాట ఆడుతుండగా ఐదుగురిని అదుపులోకితీసుకొని వారినుంచి రూ.3,500 స్వాధీనం చేసుకున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ, గ్రామాల్లో యువకులు, జూదం, ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు.

రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ పోటీలు ప్రారంభం

- బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నీస్ క్రీడల్లో పోటీలు
- పోటీలను ప్రారంభించిన జోనల్ సీఈ విజయ్‌కుమార్



ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో బాస్కెట్‌బాల్‌లో తలపడుతున్న నల్గొండ, కరీంనగర్ జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ సర్కిల్‌ల బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నీస్ పోటీలు జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్‌సర్కిల్ బాస్కెట్‌బాల్ కోర్టులో గురువారం ప్రారంభమయ్యాయి. కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఓఎంసీ సర్కిల్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని 10సర్కిళ్ల టేబుల్ టెన్నీస్ జట్లు, ఏడు సర్కిళ్ల బాస్కెట్‌బాల్ జట్లు పాల్గొంటున్నాయి. పోటీలను కరీంనగర్ జోనల్‌సీఈ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ సర్కిల్ క్రీడలకు పెట్టింది పేరన్నారు. పలు క్రీడాంశాల్లో ప్రతిభచాటి విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్‌ను కరీంనగర్ సర్కిల్ సాధిస్తుండడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్ ఎల్లవేళలా క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహిస్తాయన్నారు. ఈనెల 18వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్ఈ ఎన్ శ్రీనివాస్, ఎస్ఈ ఆపరేషన్ ఎం రమేష్ బాబు, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్ జగన్నాథ్, కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు పి రఘునందన్, ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మొదటి రోజు బాస్కెట్‌బాల్ పోటీల ఫలితాలు...

మొదటిమ్యాచ్‌లో కరీంనగర్ ఆపరేషన్‌జట్టు నల్గొండ ఆపరేషన్ జట్టుతో తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఓఎంసీ కరీంనగర్‌జట్టు నిజామాబాద్ ఆపరేషన్ జట్టుతో తలపడగా నిజామాబాద్ ఆపరేషన్ జట్టు విజయం సాధించింది. మూడోమ్యాచ్‌లో నల్గొండ ఆపరేషన్ జట్టు నిజామాబాద్ ఓఎంసీ జట్టుతో తలపడగా నల్గొండ జట్టు విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో కరీంనగర్ ఓఎంసీ జట్టు ఖమ్మం ఆపరేషన్ జట్టుతో తలపడగా ఖమ్మం ఆపరేషన్ జట్టు విజయం సాధించింది.

బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు, ఒకరి అరెస్ట్

వేములవాడ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడుతున్న వేములవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్‌చేసినట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడ టౌన్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణం అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మెల మహిపాల్ అనేవ్యక్తి వృత్తిపరంగా ఒగ్గు కళాకారుడు. గంగాదేవిని పూజిస్తూ నవుడాలమ్మ పూజలు చేస్తూ మూలికల వైద్యం ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. ఈనెల 11న వేములవాడకు చెందిన ఓవ్యక్తి జర్నలిస్ట్ ముసుగులో మహిపాల్‌కు ఫోన్‌చేసి నీవు వేములవాడకు రావాలని రాకపోతే నీపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. మహిపాల్ వేములవాడకు వచ్చి ఆ వ్యక్తిని కలుసుకోగా ఏ విషయమై నాపై ఫిర్యాదు చేస్తావని అడిగితే పొంతనలేని సమాధానాలు చెప్పడమే కాకుండా నీ గురించి పేపర్‌లో రాస్తానని బెదిరించాడు. మరుసటి రోజు మళ్లీ ఆవ్యక్తి ఫోన్‌చేసి నీవు ఒకరిని మోసం చేశావని బాధితులు పేపర్‌లో రాయమని ఒత్తిడిచేస్తున్నారని రాయకుండా ఉండాలంటే మరోవ్యక్తి అయిన రాజుకి రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. భయభ్రాంతులకు గురైన మహిపాల్ ఈనెల14న ఫోన్‌పే ద్వారా రూ.10 వేలు చెల్లించాడు. అయినప్పటికీ మిగితా రూ.20వేలు ఇవ్వాలని బెదిరించాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి కరుణాకర్ అనే వ్యక్తి రిమాండ్‌కు తరలించామని, రాజు పరారీలో ఉన్నాడని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన మట్టి ట్రాక్టర్లు

చందుర్తి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకున్నట్లు చందుర్తి ఎస్ఐ రమేష్ గురువారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం గురువారం మర్రిగడ్డ నుంచి దేవునితండా ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జోగాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను, డ్రైవర్లు అణుగుల దేవరాజ్, రత్నం సంజీవ్ అదుపులోకి తీసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ జె. రమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో కొనుగోలు చేసిన ద్విచక్రవాహనంపై సంతోషంగా ఇంటికి వస్తున్న ఓవ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్‌తెలిపిన వివరాల మేరకు.. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన ఆడేపు కుమార్ (54) కరీంనగర్‌లో సెకండ్ హ్యాండ్‌బైక్ కొనుగోలు చేశాడు. అదే బైకుపై ఇంటికి వస్తున్నాడు.

మరో ఐదునిమిషాల్లో ఇంటికి చేరుతాడనగా, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి-సుల్తాన్‌పూర్ గ్రామాలమధ్య సైకిల్‌ను ఢీకొని కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో ఆడేపు కుమార్ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాద వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసు పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరలు

వేములవాడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులు పండించిన ధాన్యం కనీసం మద్ధతు ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈసందర్భంగా 2025-26 సంవత్సరానికి మార్కెట్‌కమిటీ కార్యదర్శి సత్యనారాయణ ధరల పట్టికలో మద్దతు ధరలను గురువారం పొందుపరిచారు. రైతులు పండించిన వివిధరకాల ధాన్యాలకు ప్రభుత్వం ప్రకటించిన ఒకక్వింటాలు ధరలు ఇలా ఉన్నాయి. ధాన్యం సాధారణరకం రూ.2,369, ధాన్యం గ్రేడ్ ఏరకం రూ.2,389, జొన్నలు హైబ్రీడ్ రకం రూ. 3,699, జొన్నలు మాల్దండి రకం రూ.3,749, సజ్జలు రూ. 2,775, రాగులు రూ.4,886, మొక్కజొన్న రూ. 2,400,కందులురూ.8వేలు, పెసర్లురూ.8,768, మినుములు రూ.7,800,వేరుశనగకాయలు రూ.7,263, పొద్దుతిరుగుడు రూ.7,721, సోయా చిక్కుడు రూ.5,328, నువ్వులు రూ.9,846, వలసలు (గడ్డినువ్వులు) రూ.9,537, పత్తి మధ్యరకం పింజ రూ.7,710, పత్తిపొడుగు రకంపింజరూ.8,110క్వింటాళుకు ధరలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు

శంకరపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ఎదుట గురువారం రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్, సిరిసిల్ల డిపోలకు చెందిన బస్సులు బస్టాండ్ ఎదుట ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో బస్సుల్లోని కొంత మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సుల ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నాయి.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- నాలుగు తులాల బంగారం, నగదు అపహరణ

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని హన్‌మాన్‌నగర్‌లో బుధవారం రాత్రి దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి 4తులాల బంగారం, 50వేల నగదును ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్‌మాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న మానస అనే గృహిణి బుధవారం రాత్రి తన ఇంటికి తాళం వేసి తల్లిగారి ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 4తులాల బంగారం, నగదు మాయమైనట్లు గుర్తించింది. బాధితురాలు పోలీసులకు సమాచారం అందివడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



బీరువా తాళలు పగలగొట్టి బట్టలను చెల్లా చెదురు చేసిన దొంగలు

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాస్‌పై హత్యాయత్నం కేసులో ఇదే గ్రామానికి చెందిన నక్క రవిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం శ్రీనివాస్‌కు, రవిల మధ్య కొంతకాలంగా డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇరువురి మధ్య పంచాయతీలు కూడా జరిగాయి. డబ్బుల విషయంలో విసిగిపోయిన రవి గురువారం శ్రీనివాస్‌ను చంపివేయాలనే ఉద్దేశ్యంతో కూరగాయలు కోసే కత్తితో దాడిచేశాడు. దాడిలో శ్రీనివాస్‌కు చేతికి, గదవపై గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తదుపరి విచారణ చేపట్టిన సిరిసిల్ల సీఐ మొగిలి నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

ధర్మపురి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో గంజాయి సరఫరా చేస్తున్న చొప్పరి పృథ్వీరాజు అనేవ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ గురువారం తెలిపారు. ధర్మపురి పట్టణానికి చెందిన పృధ్వీరాజు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అతనిని సోదా చేయగా 103గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. గంజాయి స్వాధీనంచేసుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

గర్రెపల్లిలో యువకుల వీరంగం

- చికెన్ సెంటర్ నిర్వాహకులపై కత్తులతో దాడి
- ముగ్గురికి గాయాలు



షాపులో నుంచి కత్తి తీస్తున్న యువకుడు

సుల్తానాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి బస్టాండ్ సమీపంలో మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. రోడ్డు పక్కనున్న చికెన్ సెంటర్ నిర్వాహకులపై యువకులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయగా, ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గురువారం రాత్రి గర్రెపల్లి బస్టాండ్ సమీపంలోని చికెన్‌సెంటర్ వద్దకు కారులో ముగ్గురు వ్యక్తులు బీర్లు తాగుతూ సీసాలు చేతిలో పట్టుకుని వచ్చారు. చికెన్ కావాలని నిర్వాహకులతో గొడవపడ్డారు. ఒక్కసారిగా యువకులు చికెన్ సెంటర్ నిర్వాహకులను చికెన్ కొట్టడానికి ఉపయోగించే కత్తిని తీసుకొని దాడిచేయగా, నిర్వాహకులు, రసీద్‌కు గాయాలయ్యాయి. గొడవను ఆపే ప్రయత్నంలో పక్కనున్న మరో దుకాణం యజమానిని కూడా కొట్టారు. అనంతరం ముగ్గురు యువకులు అదే కారులో పరారయ్యారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. పారిపోయిన వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ముగ్గురు యువకులు చికెన్ సెంటర్ నిర్వాహ కులపై దాడి చేశారని, వారి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.6700 పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లు పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

జమ్మికుంట రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 170మంది రైతులు 1292క్వింటాళ్లు విడి పత్తి, 30మంది రైతులు 44క్వింటాళ్లు గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.6700, కనిష్ఠ ధర రూ.5300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు. శని, ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కాగా, దీపావళి పండుగ సందర్భంగా సోమ, మంగళవారం యార్డుకు సెలవు దినాలు ప్రకటించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



చింటూ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న జాతీయరహదా రిపై గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇసుక ట్రాక్టర్‌ను నడుపుతున్న ఓయువకుడు అక్కడి కక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాపూర్ గ్రామానికిచెందిన చింటూ(22)ఇసుక ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. విలాసాగర్ నుంచి పెద్ద పాపయ్యపల్లెకు ఇసుకను అన్‌లోడ్ చేసిన అనంతరం తిరిగి తనస్వగ్రామానికి రంగాపూర్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో రాంపూర్ శివారులో నిర్మాణంలో ఉన్న జాతీయరహదారిపై ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపటం మూలంగా అదుపుతప్పి ట్రాక్టర్ ఒక్కసారిగా రహదారిమీద నుంచి పక్కనేఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడిన డ్రైవర్ చింటూ తీవ్రగాయాలై ఘటనస్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలుకున్నపోలీసులు ఘటనస్థలానికి చేరుకున్నారు. ట్రాక్టర్‌కింద ఇరుక్కుపోయిన చింటూ మృతదేహాన్నిపోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతు న్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మంథని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొడుగు బిల్డింగ్ ఏరియా సమీపంలోని ఓ ఇంట్లో పట్టణానికి చెందిన బండారి శ్రీనివాస్ అనే యువకుడు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. శ్రీరామకాలనీ సమీపంలో కొనుగోలు చేసిన భూమిని యజమాని మరో వ్యక్తికి సైతం విక్రయించడంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ తనకు భూమి అమ్మినవ్యక్తి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. దీంతో అక్కడే ఉన్న వారు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనం తరం మెరుగైన చికిత్సకోసం గోదావరిఖనికి తరలించగా చికిత్స పొందు తున్నాడు. ఈమేరకు పోలీసులు విచారిస్తున్నారు.

శ్రీరాంసాగర్ వరద గేట్ల మూసివేత

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను గురువారం మూసివేశారు. ఎగువ ప్రాంతం నుంచి 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 5,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు వదిలారు.

బంతి పూల సాగుతో భరోసా

● కిలో రూ. వంద వరకు పలికిన ధర ● రైతుల వద్ద కొనుగోలు చేసిన ప్రజలు





చొప్పదండి మండలంలో సాగవుతున్న బంతి పూల తోట, మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో పూలు తెంపుతున్న మహిళా రైతు

చొప్పదండి/మానకొండూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు బంతి పూల సాగు చేసిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించింది. అటు దిగుబడితో పాటు ఈసారి మంచి ధర పలకడంతో బంతిపూల రైతులకు కాలం కలిసి వచ్చింది. పంటకు పెట్టుబడి బాగా పెరిగినప్పటికీ, చాలా మంది రైతులు రోడ్లపై రిటైల్‌గా బంతి పూలను కిలో వంద రూపాయలకు అమ్ముకున్నారు. పూలు కావలసిన ప్రజలు కూడా బంతి పూల తోటల వద్దకు వెళ్లి కొనుగోలు చేశారు. ఎకరంలో 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు బంతి పూల దిగుబడి రావడంతో రెండు లక్షల వరకు పలువురు రైతులకు ఆదాయం లభించింది. బతుకమ్మ, దసరా పండుగలకు బంతి పూలకు ఈ సారి మంచి డిమాండ్ ఏర్పడడంతో పాటు మంచి ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



కాగా మరో మూడు రోజుల్లో దీపావళి పండుగ రానుండగా బంతి పూలకు డిమాండ్ బాగా ఉండడంతో రైతులు తమ పంటకు అదే ధర పలుకుతుం దనే ఆశతో ఉన్నారు. గతంలో బంతి పూలను 10, 20 రూపాయలకు కిలో అమ్మి నష్టపోయిన సందర్భాలు ఉండగా ఈ సారి మాత్రం కిలో పూలకు వంద రూపాయలు పలకడం రైతులను గట్టెక్కించింది. మండలంలో దాదాపు 200 ఎకరాల్లో బంతి పూల సాగును రైతులు చేపట్టారు.

● లక్ష్మీపూర్‌లో...

మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పెద్ది కావ్య-శ్రీనివాస్ అనే రైతు దంపతులు 20 గుంటల భూమిని కౌలుకు తీసుకొని బంతిపూల సాగు చేశారు. పువ్వులు పూరిత స్థాయిలో కోతకు రాకపోవడంతో ఇటీవల దసరా పండుగకు అమ్మకాలు తక్కువగా జరిగాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో కోత దశకు వచ్చింది. దీంతో రెండు రోజుల్లో పువ్వులను కోసి మార్కెట్‌కు తరలిస్తామని రైతు దంపతులు తెలిపారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ముద్దసాని రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 14న ప్రారంభమైన ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లాస్థాయి అండర్19 వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి బాలబాలికల విభాగంలో 85జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో మంచి ప్రతిభకనబరిచిన శ్రీ చైతన్య డిఫెన్స్‌అండ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు మొదటిస్థానంలో నిలిచారు. ఈ ముగింపు కార్యక్ర మానికి విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాల్లో గెలుపు, ఓటములు సహజమని ఓడిన వారు నిరాశ పడకుండా, గెలుపు కోసం ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గన్నేరువరం ఎస్‌ఐ రంజిత్‌కుమార్, ఎస్‌జీఎఫ్‌ఐ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్, డిఫెన్స్ అకాడమి ప్రిన్సిపాల్ పల్లె శ్యాం సుందర్‌రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, పిడిలెంకల మహిపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సి పాల్ శ్రీనివాస్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వ్యక్తిపై దాడి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మూత్రవిసర్జన చేసిన వ్యక్తిపై బుధవారం రాత్రి నలుగురు విచక్షణరహితంగా దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. తనను పోలీసులే కొట్టారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. కరీంనగర్‌కు చెందిన పరశురాం కూలీ పనిచేసుకుంటూ రోడ్లపైన జీవనం సాగిస్తున్నాడు. తాగినమత్తులో బస్టాండ్ ఆవరణలో మూత్ర విసర్జన చేయడంతో పలువురు కొట్టారు. దాడిలో చెయ్యి విరిగింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు రావడంతో చికిత్స నిమిత్తం పోలీసులు ప్రభుత్వ అనుపత్రికి తరలించారు. డాక్టర్లు చెయ్యి విరిగిందని సర్జరీ అవసరమని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్నాడు. పోలీసులు కొట్టారని బాధితుడు తెలపడంతో వన్‌టౌన్ పోలీసులు బస్టాండ్ అవరణలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

మత్స్యకారులకు అండగా నిలవాలి



మంత్రి శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు అండగా నిలువాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకటి శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. హైద్రాబాద్‌లో గురువారం జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘ చైర్మన్ చొప్పరి రామచంద్రం ఆధ్వర్యంలో కలిసి సమస్యలను వివరించారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో మత్స్యకారులకు సొసైటీ భవనాలు నిర్మించాలని, 55 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘ మాజీ అధ్యక్షుడు కంకటి ప్రభాకర్, నాయకులు కూనబోయిన పర్శరాం, శ్రీకాంత్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కేటాయించాలి



రగుడు బైపాస్ రహదారికి ఓ వైపు ఫ్లెక్సీ కట్టిన రైతులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కేటాయించాలని రైతులు రోడ్డును ఆక్రమించుకుని ఆందోళన చేపట్టారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనువైన స్థలాలు లేకపోవడం వల్ల ప్రధాన రహదారిపై ధాన్యం కుప్పలు పోయాల్సి వస్తోందని, వాహనదారులు మరోదారి నుంచి వెళ్లాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, సిరిసిల్ల విలీన గ్రామాల రైతులు వెంకటాపూర్ గ్రామ శివారులోని వెంకటాపూర్- రగుడు బైపాస్ రహదారికి ఓ వైపు గురువారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రహదారిపై టైర్లు వేసి అడ్డుగా కట్టారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ప్రధాన రహదారిని మూసి వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్లెక్సీని తొలగించేందుకు యత్నించారు. దాంతో రైతులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ధాన్యం కుప్పలు పోసుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు.అనంతరం రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పోలీసులు తొలగించారు. కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఈ నెల 17న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు రైతులు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమం లో వెంకటాపూర్, సిరిసిల్ల విలీన గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం కొండంత..!

● దేవస్థానం పరిధిలో ఒక్కరే విద్యుత్ సిబ్బంది
● పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు సిబ్బంది కరువు
● పట్టించుకోని దేవాదాయశాఖ.. భక్తులకు శాపం



మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో స్వామి వారి దర్శనానికి వచ్చిన గోదావరిఖనికి చెందిన రాజేశ్వరి అనే భక్తురాలు గురువారం విద్యుదాఘాతంలో మృతిచెందడం దేవస్థానం అధికారుల నిర్లక్ష్యమేననే సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యంవేలాది మంది, ఉత్సవాల సమయంలో లక్షలాదిగా భక్తులతో రద్దీగా ఉండే ఇక్కడ విద్యుత్‌కు సంబందించి విధులు నిర్వహించే సిబ్బంది ఒక్కరేఉండడం చర్చనీ యాంశంగా మారింది. దేవస్థానం పరిధిలో 60కమర్షియల్, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు ఉండడం, దిగువకొండగట్టు, ఇతరప్రాంతాల్లోను కనెక్షలు వినియోగంలో ఉన్నాయి. వీటిని ఒక్కరు మాత్రమే పర్యవేక్షణ చేయడంప్రమాదాలకు కారణంగా పేర్కొంటున్నారు. దీనికితోడు రెండేళ్లుగా ఇంజనీరింగ్ అధికారులు లేకపోవడంతో పనుల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఎలక్ట్రీషియన్‌కే అప్పగించినట్లు తెలుస్తోంది.

● విద్యుత్ తీగలు ఊడి..

కొండపైన కల్యాణకట్టలో ప్రతిఏటా జరిగే జయంత్యుత్సవాల సందర్భంగా దీక్షాపరులు మాలవిరమణ చేస్తుంటారు. దీంతో అక్కడేగల మూత్రశాల వద్ద ట్యూబ్ లైట్ అమర్చారు. ఇటీవల కోతులు ట్యూబ్‌లైట్ తీగలు తెంచడంతో అవి అలాగే వేలాడుతున్నాయి. తరచూ కళ్యాణకట్టలోఇతర వాటి కోసం విద్యుత్ సరఫరా చేస్తుండగా తెగిన తీగల దానికి కూడా కరెంటు సరఫరా అవుతోంది. దీంతో బుధవారమే ఈ తీగలతో ఓ వానరం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. అప్పుడే తగుచర్యలు తీసుకుంటే గురువారం ప్రమాదం జరిగి ఉండేదికాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

● కొండపై లూజు తీగలే అధికం

కొండపైన విద్యుత్‌సిబ్బంది కొరతతో లూజు తీగలే అధికంగా దర్శనమిస్తుంటాయి. కోతులతో అవి కూడా వేలాడుతున్నాయి. తరచూ తీగలు తెగిప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ సిబ్బందిని నియమించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

● కొండగట్టు కల్యాణకట్ట దగ్గర ఘటన
● రక్షించబోయిన కోడలుకూ విద్యుదాఘాతం



రాజేశ్వరి(ఫైల్)

మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన రాజేశ్వరి అనే (84) వృద్ధురాలు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పెద్దపల్లిజిల్లా గోదావరిఖనికి చెందిన సత్యనారాయణ తన తల్లి, భార్యతో గురువారం వేకువజామున కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చారు. రాజేశ్వరి కాలకృత్యాలు తీర్చుకునేందుకు కల్యాణకట్టవద్ద గల మరుగుదొడ్లవద్దకు వెళ్లింది. క్రమంలో వృద్ధురాలు అక్కడున్న బారికేడ్‌ను ముట్టకోగా దానిపై తెగిపడిన విద్యుత్ తీగలు తాకి విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే రక్షించేందుకు రాజేశ్వరి కోడలు యత్నించగా ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబసభ్యులు స్థానికులసహాయంతో కల్యాణకట్టలో విద్యుత్‌సరఫరాను నిలిపివేశారు. అనంతరం వృద్ధురాలిని చికిత్స కోసం జగిత్యాలకుతరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది. ప్రమాదానికి ముందు మరుగుదొడ్లకు వెళ్లే మార్గాన్ని బారికేడ్‌తో మూసివేసినప్పటికీ కొండపైన తలనీలాల సేకరణ కాంట్రాక్టర్‌వద్ద పనిచేసే సురేశ్‌బాబు అనే వ్యక్తి తొలగించాడని సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా పోలీసులు గుర్తించారు.

● దేవస్థానం ఈవోతో పాటు పలువురిపై కేసు

విద్యుదాఘాతంలో తమ తల్లి రాజేశ్వరి మృతికి దేవస్థానం ఈవో, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుమారుడు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈవోతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మెట్‌పల్లి విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన మెట్‌పల్లి విద్యార్థుల ప్రాజెక్టు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యస్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జగిత్యాల జిల్లాకు చెందిన జడ్పీహెచ్ఎస్ (బాలికలు)- మెట్‌పల్లి విద్యార్థులు వర్షిత, వాగ్దేవిలు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 18 నుంచి 23వరకు భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి రాజ్యస్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరవుతారని పాఠశాల హెచ్ఎం కనకతార, గైడ్ టీచర్ సతీష్ కుమార్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్‌లు శుభాకాంక్షలు తెలిపారన్నారు. ఈ ప్రదర్శనలో బహుళ ప్రయోజన పంటల సంరక్షణ పరికరం రైతుల పంటల సంరక్షణలో ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారం అందిస్తుందని వారు తెలిపారు.

అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు మోగిన నగారా





● ఎన్నికల అధికారిగా డీసీవో మనోజ్‌కుమార్
● 12 డైరెక్టర్ పోస్టుల్లో ఒకటి ఎస్సీ, ఎస్టీ, రెండు మహిళలకు రిజర్వు
● 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
● 24న పరిశీలన... 25న తుది జాబితా విడుదల
● 1న పోలింగ్.. అదే రోజు ఫలితాల వెల్లడి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ అడిషనల్ రిజిస్ట్రార్ జి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఎన్నికల అధికారిగా జగిత్యాల జిల్లా సహకారశాఖ అధికారి సీహెచ్ మనోజ్‌కుమార్‌ను నియమించారు. నవంబరు 1న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. 2017 ఏప్రిల్‌లో పాలకవర్గ పదవీ కాలం ముగియగా ఎనిమిదేళ్ళుగా ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమిస్తూ వచ్చింది.

ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి కమిటీ పదవీకాలం మూడు రోజుల క్రితం ముగిసింది. ఈసారి కూడా ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జి కమిటీకి ఎక్స్‌టెన్షన్ ఇవ్వడమా... కొత్త కమిటీని వేయడమో జరుగుతుందనే ప్రచారం జరిగింది. దీంతో అర్బన్ బ్యాంకు సభ్యులతో పాటు పాలకవర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెల కొంది. అర్బన్ బ్యాంకు పాలకవర్గం, అధి కారులపై వేసిన నాలుగు కేసులను పరిశీలించిన న్యాయస్థానం గత మంగళవారం అన్నింటిని కొట్టి వేయడంతో ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఎనిమిదేళ్ల తర్వాత ఎట్టకేలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ఉత్కంఠకు తెరపడటమే కాకుండా సభ్యులతోపాటు బ్యాంకు వర్గాల్లో కూడా హర్షం వ్యక్తమవుతోంది.

కరీంనగర్, జగిత్యాల, గంగాధర అర్బన్ బ్యాంకుశాఖల్లో మొత్తం 9,300 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. 12 డైరెక్టర్ స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన మొదటి 12 మంది సభ్యులను ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. డైరెక్టర్ల ఎన్నిక అనంతరం ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా డైరెక్టర్లు ఎన్నుకుంటారు. అధికారుల నుంచి ఒకరిని, రిటైర్డు ఉద్యోగుల నుంచి ఒకరిని కో ఆప్షన్ సభ్యులుగా సహకారశాఖ అధికారులు నియమిస్తారు.

9,300 మంది సభ్యులకు ఓటు హక్కు

12 మంది డైరెక్టర్ల ఎన్నికకు బ్యాలెట్ ద్వారా పోలింగ్ :

ప్రస్తుత నోటిఫికేషన్‌లో 12 మంది డైరెక్టర్లకు బ్యాలెట్ ద్వారా సీక్రెట్ ఓటింగ్ నిర్వహించాలని సూచించింది. 12 మంది డైరెక్టర్ స్థానాల్లో ఒక స్థానాన్ని ఎస్సీ లేదా ఎస్టీకి, రెండు డైరెక్టర్ స్థానాలను మహిళలకు, 9 డైరెక్టర్ పదవులను ఓపెన్ కేటగిరీకి రిజర్వు చేశారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 24న నామినేషన్లను పరిశీలించి 25న తుది జాబితాను విడుదల చేస్తారు. నవంబరు 1న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్లను లెక్కిస్తారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు లైట్ బ్లూ కలర్ బ్యాలెట్, మహిళా స్థానాలకు పింక్ కలర్, ఓపెన్ కేటగిరీ స్థానానికి తెల్ల రంగు బ్యాలెట్ పత్రాలను వినియోగించాలని సూచించారు.

రద్దు చేసిన సభ్యులకు తిరిగి అవకాశం

2007-17 వరకు అధికారంలోఉన్న పాలకవర్గ సభ్యులు బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వాలు ఇచ్చారని, మరికొన్ని ఆరోపణలతో కొందరి సభ్యత్వాలను రద్దు చేసింది. దీంతో వారు కోర్టును ఆశ్రయించగా సభ్యత్వాల రద్దును కొట్టివేస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. పాత పాలకవర్గ కమిటీ సభ్యుల సభ్యత్వాలు యథావిధిగా కొనసాగడంతోపాటు తిరిగి పోటీచేసే అవకాశం లభించింది. ఆర్థిక లావాదేవీలతో కూడిన బ్యాంకు పాలకవర్గం ఎన్నికలను పార్టీరహితంగా నిర్వహిస్తున్నప్పటికి అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతరపార్టీలు వారి ప్యానల్స్‌తో ఎన్నికల బరిలో నాయకులను నిలుపుతారు. ఈసారి కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ పాలకవర్గం, తాజా మాజీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు రెండు ప్యానల్స్‌గా పోటీచేసే అవకాశాలున్నాయి.

ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడిజిల్లాస్థాయి ఆర్చరీ పోటీలను సెంటనరీకాలనీలోని రాణిరుద్రమాదేవి క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. ఇందులో పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల,జగిత్యాలజిల్లాల నుంచి సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14,17విభాగంలో ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ తదితర అంశాల్లో పోటీల్లో తలపడ్డారు. ఇందులో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా ఆర్చరీ ప్రధానకార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన వారంతా ఉమ్మడిజిల్లా తరఫున రాష్ట్రస్థాయికి ఆడతారని శ్రీనిత్యద్వితీయ,మితాలితృతీయస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, లింగం శ్రీనివాస్, వెంకటేష్, శిరీష, సింగరేణి క్రీడాకారులు రవి, అఖిల్, సంతోష్, అభిషేక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం

భగత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ బి రాజు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ లక్కీ డ్రాను ప్రకటించింది. విజేతలైన కరీంనగర్‌కు చెందిన ఇ రమేష్‌కు 25 వేల రూపాయలు, గోదావరిఖనికి చెందిన సదానందంనకు 15 వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, పి మల్లేశం, రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం బి రాజు

పత్తి పంట ధ్వంసం చేసిన ఇసుక ట్రాక్టర్లు


ధ్వంసమైన పత్తి పంట

చందుర్తి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నవారు పోలీసుల రాకను గుర్తించి తప్పించుకునేందుకు పత్తి పంటలో నుంచి ట్రాక్టర్లను తీసుకెళ్లడంతో ఎనగల్‌-మూడపల్లి శివారులోని పత్తిపంట ధ్వంసమైంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని ఎన్గల్, మర్రిగడ్డ, మూడపల్లి, హన్మాజిపేట నాలుగు గ్రామాల శివారు మధ్యలో ఉన్న ఒర్రెల్లో నుంచి ట్రాక్టర్లలో ఇసుకను ఆక్రమంగా నింపుతున్నారు. పోలీసుల రాకను పసిగట్టిన ఇసుక ట్రాక్టర్ల యాజమానులు ఓ రైతు పత్తి చేనులో ఇసుక డంప్ చేసి, పత్తి చేను మధ్యలో నుంచి ట్రాక్టర్ తీసుకెళ్లడంతో పత్తి కొమ్మలు, పత్తి నేల రాలింది. పత్తి పంటను ధ్వంసం చేసిన వారిని గుర్తించి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


నితిన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్స్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ అండర్ - 14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి బి నితిన్ ఎంపిక య్యాడు. గురువారం జిల్లా కేంద్రం పత్తిపాక వీధిలోని సిద్ధార్థ ఇంగ్లీస్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థి నితిన్‌ను పాఠశాల కరస్పాండెంట్ నాగుల సంతోష్, ప్రిన్సిపాల్స్ బిజ్జుదేవాస్య, మార్టిన్‌లూథర్ మెమోంటోతో అభినందించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో నితిన్ పాల్గొని ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

ఇల్లంతకుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం జరిగింది. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్‌సిటీ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 130మందికి నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు. 14మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉండగా రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్‌సిటీ ఎప్‌డబ్ల్యుసీబి సరళ, ఆర్‌సీ సంపత్‌కుమారి, అధ్యక్షులు పాత కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మారం ప్రశాంత్, కార్యదర్శి రొండ్ల ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి నగేషు, కంటి వైద్య నిపుణులు చింతల ప్రభాకర్, సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యలక్ష్మి, రాఘవేందర్‌రెడ్డి, సదాశివరెడ్డి ఉన్నారు.

ఘనంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండాలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలను ఊరేగించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో తండా పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

● ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు


ఆలయ కాంట్రాక్టు కార్మికుల కార్యవర్గ సభ్యులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను దేవస్థానమే నేరుగా వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. వేములవాడ రాజన్న ఆలయ సమీపంలో కాంట్రాక్టు కార్మికుల జిల్లా మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ దేవాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఇన్సూరెన్స్, ప్రమాద బీమా రూ. 25 లక్షల కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

● దేవస్థాన కాంట్రాక్టు కార్మికుల కార్యవర్గం

గౌరవ అధ్యక్షుడుగా కడారి రాములు, ముఖ్యసలహాదారుగా వేణు, అధ్యక్షులుగా డప్పు చంద్రకళ, ఉపాధ్యక్షులుగా దొబ్బల రేణు, ఆరెల్లి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా వడ్లూరి కేతవ్వ, సహాయకార్యదర్శిగా మనుగు ప్రమీల, కార్యదర్శులుగా పెంట లక్ష్మి, నిర్మల కోశాధికారిగా లీల కౌన్సిల్ సభ్యులుగా విజయ, అనసూర్య, కాసవ్వ, అంజవ్వ, లచ్చవ్వ, రజిత, రాజేశం, శంకరవ్వ లక్ష్మి, శోభ, లక్ష్మీనారాయణ, రాజమని, దేవరాజేశ్వరి, రామయ్య, రాజు ఎన్నికైనట్లు రాములు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూపు


కోనరావుపేట కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

కోనరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలో వరి కోతలు వేగవంతంగా కొనసాగుతుండగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో రాశులు పోసి ఆరబెడుతున్నారు. కోనరావుపేట మండలంలో వారం రోజులుగా వరి కోతలు వేగవంతంగా సాగుతున్నాయి. మరో వైపు హార్వెస్టర్ల కొరత ఉండడంతో రైతులు పడిగాకులు కాయాల్సి వస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేయాలని సుద్దాల గ్రామానికి చెందిన రైతు మల్లేశం రైతులకు కోరుతున్నాడు. వారం రోజుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువస్తున్నారన్నారు.

పాఠశాల పర్యవేక్షణ బాధ్యతలపై హర్షం

చందుర్తి అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు ముఖేష్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల విద్యాశాఖ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గ్రీన్ బ్యాడ్జీలు ధరించి రాష్ట్ర పాఠశాల విద్యా శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి జలేందర్ రెడ్డి, గడప రఘుపతి రావు, మొలిగె శంకరయ్య, గుర్రం కృష్ణారెడ్డి జువ్వాడి అనిల్ రావు ధర్మపురి శ్రీనివాస్, వేముల సుజాత, రాకం రవి కుమార్ కాపిల్ల నరేష్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కోనరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మరిమడ్ల ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన పులి రాజు గౌడ్ బదిలీపై వెళ్తుండగా ఆయనను తోటి ఉపాధ్యాయులు విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతిరావు, ఉపాధ్యాయులు గంగాధర్, శ్రీనివాస్, తరక్‌చందు, చంద్రశేఖర్, పద్మ, కృష్ణవేణి, ప్రజాప్రతినిధులు కొమ్ము స్వప్న, దేవరాజు, పుంగన్ గౌడ్, గోపు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

పాత రైతుబజార్ షెడ్డు తొలగించాలని నిర్ణయం

● ఉపాధి కోల్పోతామంటున్న కూరగాయల వ్యాపారులు


ఇల్లంతకుంటలోని పాత రైతుబజార్ షెడ్డు

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాల పాటు ప్రజలకు అందుబాటులో ఉన్న ఇల్లంతకుంటలోని పాత రైతుబజార్ షెడ్డును తొలగించాలని నిర్ణయించారు. మండల కేంద్రంలో బస్టాండు లేని సమయంలో ప్రయాణికుల కోసం 1990 ఇల్లంతకుంటకు చెందిన ముంజ ఎల్లయ్య అనే జీపు డ్రైవర్ బస్టాండు షెడ్ ఏర్పాటు చేయడంతో పాటు తాను ఉపాధి పొందడానికి హోటల్ నిర్మాణం చేపట్టాడు. అనేక సంవత్సరాల పాటు ఇది ప్రయాణీకులకు ఉపయోగపడింది. అనంతరం దీని సమీపంలోనే 1999లో నూతన బస్టాండు నిర్మాణం చేపట్టారు. దీనిని కొంత ఆధునీకరించి 2003లో రైతుబజార్‌గా మార్చారు. ఈ షెడ్‌లోనే కొంతమంది వ్యాపారులు కూరగాయలు అమ్ముకోవడం ప్రారంభించారు. మండల కేంద్రంలో వారసంత ఏర్పాటు చేయాలని నిర్ణయించి బస్టాండు ప్రాంతంలోనే వారసంత ఏర్పాటు చేశారు. జనాభా పెరగడం, వారసంతకు వ్యాపారులు ఎక్కువగా రావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనితో తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రైతుబజార్‌ను నూతనంగా నిర్మించారు. ప్రతి గురువారం ఇక్కడ వారసంత జరుగుతుండగా, ప్రతి రోజు పాత రైతు బజార్‌లో కూరగాయలు అమ్ముతుంటారు. కొత్తబస్టాండులో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి ప్రజలు తీసుకవచ్చారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. పాత రైతుబజార్ షెడ్ తీసివేసి దాని స్థానంలో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. దీనితో గురువారం గ్రామపంచాయతీ, ఆర్టీసీ అధికారులు వచ్చి పాత రైతుబజార్‌లోని కూరగాయల వ్యాపారులను ఖాళీచేయాలని ఆదేశాలు జారీచేశారు. అనేక సంవత్సరాలుగా ఉపాధి పొందుతున్న తమను ఖాళీచేయించడం న్యాయం కాదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు

- చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి



మండల కేంద్రంలోని పాతరైతు బజారు షెడ్డును తొలగించి మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. కూరగాయల వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా కొత్త రైతుబజారులో ఏర్పాట్లు చేస్తున్నాం. పాతరైతు బజారులోని వ్యాపారులకు ఖాళీ చేయాలని సూచించాం.

19న మండల స్థాయి క్రీడలు

చందుర్తి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో ఎన్‌వైకే, మైభారత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పోచెట్టి రాకేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 19న కబడ్డీ, వాలీబాల్, షటిల్, రన్నింగ్, చెస్, జావలిన్ త్రో లాంటి క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడల్లో గెలిచిన ప్రతి జట్టుకు ప్రథమ, ద్వితీయ స్థానాలకు షీల్డ్‌లు అందజేస్తామన్నారు. యువత క్రీడల్లో రాణించి శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. దేశ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించేది యువకులేనని అన్నారు. క్రీడల ద్వారా శారీరర ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. క్రీడలపై ఆసక్తి పెంచుకుని తగినంత సమయం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల క్రీడాకారులు మార్త రాజు, గుగ్గిళ్ళ సాగర్, వెంగళ వెంకటేష్, మెడిశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలి

● మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలి ● ఎస్పీ మహేష్ బి. గీతే


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బి. గీతే

వేములవాడ క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని ఎస్పీ మహేష్ బి. గీతే అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా కేసుల పరిష్కారం శాతం పెంచాలన్నారు. దీంతో నిందితులకు శిక్షలు పడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రోజు పోలీస్‌స్టేషన్ పరిధిలో విజబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, సిబ్బంది పట్టణాలు, గ్రామాలు సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా త్వరగా ఉన్నతాధికారులకు చేరేలా సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయిన బాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదుచేసినపుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి బ్లాక్ స్పాట్స్ ఏర్పరచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపడం, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిని గుర్తించాలన్నారు. ప్రతి రోజు వాహన తనిఖీలు చేస్తూ పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐలు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

శృంగేరి పీఠాధిపతికి ఘనస్వాగతం పలకాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షకులు, దేశవ్యాప్తంగా నాలుగు పీఠాలను స్థాపించి వాటిని సంరక్షిస్తున్న దైవసమానులు విధుశేఖర భారతి స్వామికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, హిదుత్వవాదులు, పట్టణ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనస్వాగతం పలుకాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ధర్మ విజయయాత్రలో భాగంగా ఈ నెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం శృంగేరి పీఠాధిపతి వేములవాడకు రానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపి పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ నాయకులు రేగుల మల్లికార్జున్, కోలా కృష్ణస్వామి, సంటి మహేష్, మల్లేశం, అక్కనపల్లి వివేక్, నేరేళ్ల సాయి, మైలారం శ్రీనివాస్, కిరణ్, నామాల శేఖర్, బిల్ల కృష్ణహరి తదితరులు ఉన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల కోసం బీసీ సంఘాల జేఏసీ నాయకులు ఈ నెల 18న పిలుపునిచ్చిన బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశం కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్9ని ప్రవేశ పెట్టిందని అన్నారు. హైకోర్టు స్టే విధించిందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు బంద్ పాటించాలని మల్లేశం కోరారు. నాయకులు శ్రీనివాస్, సత్తయ్య, మహేందర్, ముత్యం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్ సాధించాలి

ముస్తాబాద్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధనకు బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఈడ్గురాళ్ల సురేశ్‌గౌడ్ పేర్కొన్నారు. బీసీ సంఘాలు రుపొందించిన కార్యచరణ మేరకు ఈనెల 18వ తేదీన తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. తెలంగా వ్యాప్తంగా తలపెట్టిన బంద్‌లో ప్రైవేటు వ్యాపార , వాణిజ్య సంస్థలు, ప్రైవేటు పాఠశాలలు బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొండ యాదగిరిగౌడ్, శీలం స్వామి, పుల్లూరి రవి, గుండెల్లి శ్రీనివాస్, గజ్జెల రాజు, గూడూరు భరత్, తోట ధర్మేందర్, శ్రీనివాస్, శంకర్, పద్మ, త్తయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు రాజన్న దర్శనం నిరంతరం కొనసాగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్, లక్ష్మీనర్సింహారావు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దర్శనం నిరంతరంగా కొనసాగాలని, వచ్చే సమ్మక్క, సారలమ్మ మహాశివరాత్రి జాతర వరకు ఆలయాన్ని మూసివేకుండా భక్తులకు దర్శనం కల్పించాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో గురువారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ ఎల్ఈడీ స్క్రీన్‌లో రాజన్న దర్శనాన్ని కల్పిస్తామని, ప్రచార రథంపై దేవుడిని చూపిస్తామని చెబుతున్నారు. ప్రచార రథం చుట్టూ భక్తులు తిరుగుతూ మొక్కులు చెల్లించుకుంటారా.. అని ప్రశ్నించారు. రాజన్న ఆలయాన్ని నమ్ముకుని ఐదు వేలకుపైగా చిరు వ్యాపారస్తులు ఉన్నారని, వారి జీవనోపాధి ఏంటని ప్రశ్నించారు. ఆలయాన్ని రాతి కట్టడాలతోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ యాదాద్రిని నల్లరాతి కట్టడాలతో ఎంతో అద్భు తంగా నిర్మించారని, రాజన్న ఆలయం 24 గుంటల్లో ఉంటూ ఆనాడు భూసేకరణ చేసి 33 ఎకరాలతో ఆలయాన్ని విస్తరణ చేసి, భూసేకర ణలో భాగంగా ఒక్కొక్కరికి సుమారు ఎకరానికి రూ. 93 లక్షల చొప్పున భూపరిహారం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అందించామన్నారు. ఆలయ అభివృద్ధికి ఎంత ఖర్చు అవుతుందో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ స్పష్టత ఎందుకు ఇవ్వడం లేదని విమర్శించారు. జాతరను దృష్టిలో పెట్టుకుని మూడు నెలల తర్వాతనే అభి వృద్ధి పనులు చేయాలన్నారు. ఈ సమావేశంలో గూడూరి ప్రవీణ్, రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, కందుల క్రాంతి, గొస్కుల రవి, నీరటి మల్లేశం కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్


సారంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెలుముల స్వరూపరెడ్డి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులు ధాన్యంను విక్రయించాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పెద్దూరు, పెద్దబోనాల, సర్దాపూర్‌లో ఏఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాలను సిరిసిల్ల మార్కెట్ కమిటి చైర్ పర్సన్ వెల్మల స్వరూపతిరుపతిరెడ్డితో కలసి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రారంభించారు. పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో మొత్తం 231 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని అన్నారు. తేమ శాతం 17 ఉండేలా చూసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2389, కామన్ రకానికి రూ. 2369 నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాష్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ ఆలీబేగ్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు దుబాల వెంకటేశం, ఎండీ ఖాజా, నాయకులు వెల్మల తిరుపతిరెడ్డి, సిహెచ్ కమలాకర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి సూచించారు. గురువారం తంగళ్లపల్లి మండలంలోని భరత్‌నగర్, ఇందిరానగర్, జిల్లెల్ల రాముల బండ, మల్లాపూర్, దేశాయ్‌పల్లె, సారంపల్లి, బద్దనపల్లి, బస్వాపూర్, బాలమల్లుపల్లె, నర్సింహులపల్లె గ్రామాల్లో ఐకెపి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జల్లం ప్రవీణ్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, పొన్నల పర్శరాములు, తిరుపతిరెడ్డి, రాములు , నాయకులు మునిగేల రాజు, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, ఐకెపి ఏపిఎం రజితి, సిసిలు, రైతులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమిరిశెట్టి విజయ తిరుపతి పేర్కొన్నారు. గంభీరావుపేట మండలంలో గురువారం 8 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ తిరుపతి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ మారుతిరెడ్డి, మండల కాంగెస్ అధ్యక్షుడు హమీద్, నాయకులు మోహన్, విఠల్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండా, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్, రాచర్ల బొప్పాపూర్, బాకురుపల్లితండా గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాంరెడ్డి, ఇన్‌చార్జీ ఏపీఎం లక్ష్మణ్, నాయకులు నర్సయ్య, గౌస్, బాలయ్య, గణపతి, లక్ష్మారెడ్డి, దేవేందర్, రాజయ్య, భూమిరెడ్డి, కిష్టారెడ్డి, సాహెబ్, రాజేశం, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, బాపురెడ్డి, సురేశ్, గ్రామైక్య సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ విజయ



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

వేములవాడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం భాగ్య హెల్త్ క్లబ్ విభాగం, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు సీపీఆర్‌పై అవగహన కల్పించారు. ప్రభుత్వ వైద్య కళాశాల సిబ్బంది డాక్టర్ రాధిక, దివ్య సీపీఆర్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ లావణ్య, డాక్టర్ కరుణ, హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు శకుంతల, నరసయ్య తదితరులు ఉన్నారు.

కోనరావుపేట : మండలం మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు సిపిఆర్‌పై మండల వైద్యాధికారి వేణుమాధవ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్వాస ఆగిపోయిన వ్యక్తికి సిపిఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యాదవ్, వైద్య సిబ్బంది సూపర్ వైజర్ రషీద్, అరుణ చందు సవైలాల్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సిపిఆర్ కార్డియో పల్మనరీ రెసిస్టెంట్‌పై 108 అంబులెన్స్ సిబ్బంది గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి రుద్రంగి అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి వెంకటరమణారెడి, గణేష్, పైలెట్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ

రుద్రంగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలో ఇటీవల వివిద కారణాలతో మరణించిన బాధితుల కుటుంబాలను వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు గురువారం పరామర్శించారు. వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్త పరిచారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్, గంగం మహేష్‌రెడ్డి, మాడిశెట్టి ఆనందం, మంచె రాజేశం, ఉప్పులుటి గణేష్, దయ్యాల పెద్దులు, దయ్యాల నారాయణ పాల్గొన్నారు.